సాక్షి చిత్తూరు

మంగళవారం । 2 । మే । 2023



పోషకాల బాహుబలి..అంబలి

మండు వేసవిలో చలువ చేసే పోషకాహారం అంబలి. దీన్ని గంగజాతరలోనే ప్రత్యేక వంటకంగా వినియోగిస్తున్నారు. -10లో



ఈత.. గుండెకోత

ఈత నేర్చుకుంటున్న కొడుకు మునిగిపోవడంతో కాపాడేందుకు బావిలో దూకిన తండ్రి కూడా మృతి చెందాడు. -8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	24
తిరుపతి	32	25
తిరుమల	27	21
గూడూరు	32	26
నగరి	31	25

న్యూస్‌రీల్

కష్టపడే వారే కార్మికులు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్

చిత్తూరు రూరల్: కష్టపడి పని చేసే వారే కార్మికులని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్ కుమార్ అన్నారు. చిత్తూరు-1 డిపోలో సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జితేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కార్మిక శాఖ అధికారి జగదీష్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కార్మికులు తెలుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు జరిగే అన్యాయాన్ని, సమస్యలను యాజమాన్యంతో సామరస్యంగా చర్చించి పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్మికుల సమస్యలకు సంబంధించి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీలో డ్రైవర్లు సైనికుల్లా పని చేస్తున్నారని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం వెనుక డ్రైవర్ల కృషి ఎంతో ఉందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులంతా సంస్థను లాభాల బాటలో పయనించడానికి సమష్టి కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్మిక శాఖ ద్వారా ఈఎస్ఐఎఫ్ కార్డులను కార్మికులకు పంపిణీ చేశారు. సమావేశంలో న్యాయవాది కృష్ణకుమార్, డిపో అధికారులు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించనున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికేట్ సమ్మర్ ట్రైనింగ్ కోర్సును వినియోగించుకోవాలని డీఈవో విజయేంద్రరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోపు www.bse.ap.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ ఏడాది మే 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయి ఉండాలని చెప్పారు. 45 సంవత్సరాలు దాటి ఉండకూడదని చెప్పారు. పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారికి విశాఖపట్టణం, కాకినాడ, గుంటూరు, వైఎస్ఆర్ కడప, అనంతపురం జిల్లాల్లో సమ్మర్ ట్రైనింగ్ శిక్షణ ఇస్తారని డీఈవో తెలిపారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలో ఉన్న పరీక్షల విభాగంలో సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

పీఎంశ్రీ పథకానికి 30 బడుల ఎంపిక



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా 30 సర్కారు బడులు ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైనట్లు జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో జిల్లాలో 21 జెడ్పీ హైస్కూల్స్, 3 సోషల్ వెల్ఫేర్, 1 మోడల్ స్కూల్, 3 ప్రభుత్వ పాఠశాలలు, 1 మునిసిపల్ హైస్కూల్, 1 ప్రాథమిక పాఠశాలలున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ఆశయంగా ప్రభుత్వాలు అన్ని రకాల సౌకర్యాలను సర్కారు బడుల్లో కల్పిస్తున్నట్లు తెలిపారు. పరికరాలు, ల్యాబ్‌లు అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పాఠశాలలు మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమన్నారు. ఐదేళ్ల అమలులో ఉండే ఈ పథకంలో వల్ల పాఠశాల విద్య బలోపేతం చేయడం, స్మార్ట్‌క్లాస్ రూములు, లైబ్రరీలు, గ్రీన్ పాఠశాలలు, క్రీడా సదుపాయాలు, ఆర్ట్ రూములు ఈ స్కూళ్లల్లో ఏర్పాటు చేస్తారని ఏపీసీ వెల్లడించారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి ఐరాల మండలం పొలకల పంచాయతీ, గుడిపల్లె గ్రామానికి చెందిన జస్వంత్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి వద్ద స్వామివారి నిత్య అన్నదానానికి విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

ఊపిరాడనివ్వకుండా ఇబ్బంది పెట్టే ఆస్తమాను అదుపు చేసే వైద్యం అందుబాటులోకి వచ్చింది. జలుబు, దగ్గుతో బాధపడేవారు ఆస్తమాను త్వరగా గుర్తిస్తే కట్టడి చేయడం సాధ్యమవుతుంది. ఆస్తమా నివారణకు ప్రభుత్వం ఆధునిక వైద్యాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో క్రమంగా ఆస్తమా కేసులు పెరుగుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. వెంటనే చర్యలకు ఉపక్రమించింది. ప్రపంచ ఆస్తమా నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఊపిరి పీల్చుకోండి



- ఆస్తమాకు ఆధునిక చికిత్స
- జిల్లాలో పెరుగుతున్న శ్వాస సంబంధిత కేసులు
- ఎలర్జీలు, చెడు అలవాట్లే వ్యాప్తికి కారణం
- నేడు ప్రపంచ ఆస్తమా డే



చిత్తూరు రూరల్: సాధారణ మన జీవన శైలి, వాయుకాలుష్యం కారణంగా ఆస్తమా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ దీని బారిన పడుతున్నారు. చలికాలం, వానాకాలం వచ్చిందంటే ఆస్తమా రోగులు తీవ్రంగా భయపడతారు. పూర్వం ఆస్తమాకు మందులు లేవు. ఇప్పుడు మందులు ఉన్నాయి. ఆస్తమాను పూర్తిగా అదుపులో ఉంచవచ్చు. జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇక్కడకు నిత్యం 5 వేలకు పైగా ఓపీలు వస్తుంటాయి. ఇందులో దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు, ఆస్తమా లక్షణాలు ఉన్నవారు రోజుకు 30 నుంచి 50 వరకు కేసులు వస్తున్నాయి. వీటిని డాక్టర్లు పరీక్షించి ల్యాబ్ పరీక్షల ఆధారంగా ఆస్తమాకు చికిత్స అందిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు, మాత్రలు అందుబాటులో ఉన్నాయి. ఈ వ్యాధి నయమయ్యేంత వరకు వైద్యుల పరిశీలనలో ఉండేలా చూస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో కేసులు వస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

ఆస్తమా రోగులకు చికిత్స

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆస్తమా రోగులకు సాధారణంగా రెండు నుంచి మూడు వారాల పాటు చికిత్స అందిస్తారు. ఈ రోగులు ఇన్‌హేలర్, కొన్నిరకాల మాత్రలు వాడాలి. ఆస్తమా సోకితే ఆక్సిజన్ స్థాయి పడిపోవడంతో గుండెజబ్బులకు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి వైటల్ ఆర్గానిక్స్, కిడ్నీపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆస్తమా రోగులకు అన్నిరకాల చికిత్స ఉచితంగానే అందిస్తున్నారు. తీవ్రమైన ఆస్తమాతో బాధపడే రోగులకు వెంటిలేటర్లపై చికిత్స చేస్తారు. ఏరో థెరపీ, ఇన్‌హేలర్ థెరపీ, నెబులైజేషన్ చికిత్సలతో రోగులకు నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఆస్తమాకు కారణాలు

- వాతావరణంలో మార్పులు
- పొగ, దుమ్ముతో నిండిన పరికరాలు
- బాడీ స్ప్రేలు
- అగరబత్తీల పరిమళాలు
- దోమల నివారణకు వాడే కాయిల్స్
- పెంపుడు జంతువులు
- టపాసుల వల్ల వచ్చే పొగ
- పూల పుప్పొడి రేణువులు
- సరిపడని ఆహారం తీసుకోవడం
- శీతల పానీయాలు

ఆస్తమా లక్షణాలు

- ఆయాసం ప్రధాన లక్షణం
- పిల్లికూతలు, దగ్గు
- ఛాతి బరువుగా ఉండడం
- జలుబు, తుమ్ములు రావడం
- ముక్కు నుంచి నీరు రావడం
- జన్యు సంబంధిత కారణాలు
- చలి కాలంలో ఆయాసం ఎక్కువ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ధూమపానానికి, దుమ్ము, ధూళికి దూరంగా ఉండడం
- శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు వంటివి తీసుకోకుండా ఉండడం
- ఇంట్లో బూజు దులపడం వంటివి చేయకూడదు
- ఇన్‌హేలర్ కలిగి ఉండడం చాలా ముఖ్యం

నమోదైన ఆస్తమా కేసులు

నెల	సంఖ్య
జనవరి	4
ఫిబ్రవరి	4
మార్చి	52
ఏప్రిల్	61

ముందు జాగ్రత్త అవసరం



దుమ్ము, దూళి, ఘాటు వాసనలు, స్ప్రేలకు దూరంగా ఉండాలి. చల్లని నీటితో తలస్నానం చేయకూడదు. శుభ్రత పాటించాలి. గోరువెచ్చని నీరు తాగాలి. పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. పొగతాగరాదు. మద్యం తాగకూడదు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలి.

– రవిరాజు, జిల్లా క్షయ నివారణాధికారి

పరిపూర్ణం..పరిణయోత్సవం





పరిణయోత్సవంలో స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) పరిణయ వేదికకు గరుడవాహనంపై ఊరేగింపుగా వెళుతున్న స్వామివారు

తిరుమలలో శ్రీపద్మావతీ, శ్రీనివాసుల కల్యాణం కమనీయంగా సాగింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు నారాయణగిరి ఉద్యానవనం భక్తులతో కిక్కిరిసింది. చివరి రోజైన సోమవారం సాయంత్రం శ్రీవారి ఆలయం నుంచి స్వామివారు గరుడ వాహనంపై, దేవేరులు పల్లకీపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. కళాకారులు మంగళకరంగా సంగీత, మేళ, తాళ వాయిద్యాలను ప్రదర్శించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రసరమ్యంగా అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. హారతి అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. దీంతో మూడురోజుల పద్మావతీ పరిణయోత్సవాలు ఘనంగా ముగిశాయి. – తిరుమల

ముందు గంగమ్మ తర్వాతే శ్రీవారి దర్శనం



మహా కుంభాభిషేకం పూజల్లో మంత్రి రోజా

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్య గుంట గంగమ్మను దర్శించి తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించే సంప్రదాయాన్ని భక్తులు పునఃప్రారంభించాలని రాష్ట్ర మంత్రి ఆర్కే.రోజా పిలుపు నిచ్చారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ప్రతిష్ట, ఆలయ పునఃప్రారంభం నేపథ్యంలో అమ్మవారి మహాకుంభాభిషేక మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అంతకుముందు మంత్రికి ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన చొరవతో ముఖ్యమంత్రి జగనన్న తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు.

ప్రతి గడపలో 'సంక్షేమ' కాంతులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని పిళ్లాగుండ్లపల్లి, ఎస్.టీ కాలనీ, మఠం, డీ.కే.మర్రిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలే లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. అనంతరం ఆరిమాకులపల్లి బీసీ కాలనీవాసులకి 17 మందికి, డీ.కే.మర్రిపల్లి దళితులకు 62 మందికి జగనన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. పిళ్లాగుండ్లపల్లి గ్రామానికి చెందిన రామచంద్ర నాయుడుతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటామని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, సర్పంచ్‌లు మార్కొండయ్య, జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టాప్-10లో పలమనేరు ఏఎంసీ



పలమనేరు ఏఎంసీ చైర్మన్, సెక్రటరీలకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వార్షిక లక్ష్యాలను మించి పన్నులు వసూలు చేసిన మార్కెట్లలో పలమనేరు టాప్‌టెన్‌లో ఒకటిగా నిలిచిందని స్థానిక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సంజీవ కుమార్ తెలిపారు. ఆ మేరకు 101 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పలమనేరు ఏఎంసీకి మార్కెటింగ్ కమిషనర్ నుంచి ప్రత్యేక ప్రశంసాపత్రం అందింది. దీంతో గంటావూరులో జరిగిన ఓ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ పాలకమండలి సభ్యులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో రద్దీ



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో భక్తుల తాకిడి పెరిగింది. దీంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయి ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. దీంతో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి దర్శనం కల్పించారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఈ మేరకు ప్రత్యేక తరగతుల విధి విధానాలను సోమవారం కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ఏపీ మోడల్, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ, గురుకుల కళాశాలల్లో తప్పనిసరిగా ప్రత్యేక తరగతులను ఈ నెల 2వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించాలని స్పష్టం చేశారు. వేసవి తరగతులకు హాజరుకావడానికి అవసరమైన సౌకర్యాలను ఇంటర్మీడియట్ అధికారులు సమకూరుస్తారని తెలిపారు. కళాశాలల్లో పనిచేసే ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలన్నారు. తప్పని పరిస్థితుల్లో (ఆరోగ్య సమస్యలు బాగాలేకుంటే) మాత్రమే సెలవు తీసుకోవాలని సూచించారు. తరగతులను తనతో పాటు జేసీ, ఇంటర్మీడియట్ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తారని కలెక్టర్ అన్నారు. ప్రైవేట్ కళాశాలల అనుమతులను త్రిసభ్య కమిటీ ఆమోదిస్తుందని చెప్పారు. ఆ కమిటీ సందర్శించి ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలను పరిశీలించి, అనుమతిస్తుందని కలెక్టర్ వెల్లడించారు.

9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

ఈ నెల 9వ తేదీ నుంచి జగనన్న కు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డు నుంచి మాట్లాడతారన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి అవసరమైన శిక్షణ నిమిత్తం త్వరలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఈలు విజయ్ కుమార్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, పీడీలు పద్మనాభం, తులసి, గంగాభవాని, నాగ శైలజ, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్ర నాథ్ రెడ్డి, డీపీఓ లక్ష్మీ, జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్ రెడ్డి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

90శాతం పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాలోని సామాజిక పింఛనుదారులకు సోమవారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీలు చురుగ్గా పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,62,458 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉంటున్న లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ల మొత్తాన్ని నేరుగా అందించారు. సాయంత్రానికి 90.56 శాతం పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో వంద శాతం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసీ తెలిపారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- స్పందనకు 132 అర్జీలు
- వినతులు స్వీకరించిన జేసీ శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదయ్యే వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్పందనలో అర్జీలు అందజేశారు. ప్రజల సమక్షంలో సంబంధిత అర్జీలను పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను జేసీ ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు స్పందనలో నమోదయ్యే అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు శాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ స్పందనకు 132 అర్జీలు వచ్చాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు 95, హౌసింగ్ శాఖ 6, ఇరిగేషన్ ఎస్ఈ 1, ఐసీడీఎస్ 1, నగరపాలకసంస్థ 2, ఏపీఎస్ఆర్టీసీ 1, విద్యాశాఖ 1, సోషల్ వెల్ఫేర్ 2 , పోలీసు శాఖ 1, ఫారెస్ట్ 1, నేషనల్ హైవే 1, పింఛన్లు, రేషన్‌కార్డులు 20 అర్జీలు వచ్చాయని తెలిపారు. పూర్వీకుల ఆస్తికి సంబంధించిన వారసులు తాము ఉండగా బంగారుపాళ్యం తహసీల్దార్ మరొకరికి పట్టా ఇచ్చారని బోడగుండ్ల గ్రామస్తులు వాపోయారు. రెండు సర్వే నెంబర్లలో 0.59 సెంట్లు, 2.23 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ఆ భూమిపై ప్రస్తుతం వేరొకరు పట్టా తీసుకున్నారని బాధితులు మొగిలప్ప, చంద్రయ్య చెప్పారు. ఈ సమస్యను విచారించి పరిష్కరించాలని బంగారుపాళ్యం తహసీల్దార్‌ను జేసీ ఆదేశించారు.

గాలి,వాన కారణంగా పొలంలో పడిన విద్యుత్ తీగలను, ఇతర సామగ్రిని తొలగించాలని ఎల్‌బీపురం ఎస్సీ కాలనీవాసులు కోరారు. తమ సమస్యను విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు వాపోయారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ట్రాన్స్‌కో అధికారులను జేసీ ఆదేశించారు.

స్పందనకు 10 ఫిర్యాదులు



వినతుల స్వీకరణలో ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీ

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చీటింగ్ 12, కుటుంబ తగాదాలు 2, వేధింపులు 1, మిస్సింగ్ 1, ఆస్తి తగాదాలు 5 చొప్పున వినతులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

సెల్వరాజ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, నిర్జీవంగా ఉన్న బాలుడిని చూసి విలపిస్తున్న బంధువులు





ఈత.. గుండెకోత

వ్యవసాయ బావిలో తండ్రీకొడుకుల మృతి

- ఈత నేర్చుకుంటూ మునిగిన పిల్లాడు
- కాపాడబోయి తండ్రి సైతం మృత్యువాత
- పెనుమూరు మండలంలో విషాదం





మృతులు సెల్వరాజ్, ధనుష్ (ఫైల్‌ఫొటోలు)

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని గ్రామానికి వచ్చిన ఆ కుటుంబం రెండు రోజులు కూడా గడవకుండానే ఇద్దరిని పోగొట్టుకుంది. ఈత నేర్పించడానికని బావిలోకి దిగిన తండ్రి, కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పెనుమూరు మండలంలో సోమవారం జరిగిన ఈ ఘటన ఆ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఎర్రమట్టిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సెల్వరాజు(40) వృత్తిరీత్యా తిరుపతిలో కారు డ్రైవర్. అతనికి భార్య కోకమ్మ, ఆరో తరగతి చదివే కుమారుడు ధనుష్(12), ఇద్దరు కుమార్తెలున్నారు. అందరూ తిరుపతిలో ఉండగా.. పాఠశాలకు వేసవి సెలవులివ్వడంతో రెండు రోజుల కిందట స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం విడిదిపల్లె సమీపంలోని ఓ వ్యవసాయబావి వద్దకు సెల్వరాజు తన కుమారుడు ధనుష్‌కు ఈత నేర్పడానికి మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. ధనుష్‌ను బావిలో దింపిన సెల్వరాజు నెమ్మదిగా ఈత నేర్పుతున్నాడు. ఒక్కసారిగా ధనుష్ నీటిలో మునిగిపోయాడు. అతడిని పైకి తీసుకురావడానికి ప్రయత్నించిన సెల్వరాజ్ కూడా నీటిలో మునిగి పైకి రాలేదు. ఎంతసేపటికీ తండ్రీకొడుకులు పైకి రాకపోవడంతో గట్టుపై ఉన్న మరో యువకుడు ఏడుస్తూ అరపులు వేయడంతో అటుగా వెళుతున్న వారు బావిలో దూకి వారి కోసం గాలింపు చేపట్టినా ప్రయోజనంలేకపోయింది. పెనుమూరు ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని.. అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వారివల్ల కూడా కాకపోవడంతో గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లు బావిలోకి దించి మృతదేహాలను వెలికితీశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ భాస్కర్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



సెల్వరాజ్ మృతదేహాన్ని బావి నుంచి వెలుపలకు తీసుకొస్తున్న గ్రామస్తులు

రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా..

తండ్రి కొడుకు బావిలో పడి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. సీఎం వైఎస్ జగన్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో సీఎం స్పందించి సెల్వరాజ్‌కు రూ.5 లక్షలు, ధనుష్‌కు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రకటించారు. ఈ మొత్తాన్ని మంగళవారం బాధిత కుటుంబానికి అందజేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79

వక్ఫ్‌బోర్డుకు చేరిన భూ వివాదం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని శేషాపీరన్ మసీద్ కమిటీ, దేవాదాయ శాఖల మధ్య ఆదివారం జరిగిన భూ వివాదం సమస్య జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి చేరిందని వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షులు గఫార్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 6,200 ఎకరాలు ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వీటి పరిరక్షణకు ప్రతి జిల్లాకు ఒక వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, మైనారిటీ అధికారిని నియమించారని చెప్పారు. నగరంలోని హైరోడ్డులో సర్వే నెంబర్ 602/1ఏ, 602/1ఏ2 లో ఉన్న 6.31 ఎకరాలను ఏపీ సర్వే కమిషన్ ద్వారా సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించనున్నట్లు అందులో పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలో సర్వే నెంబర్ 393,963,964,310/5 లో ఉన్న వక్ఫ్ బోర్డు 17 ఎకరాల భూముల్లో అవకతవకలపై పలు ఫిర్యాదులు అందాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్

వెదురుకుప్పం: బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు, మండలంలోని ఎనమలమందకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన తరుణ్ కిడ్నాప్ చేశారు. కిడ్నాప్‌కు సహకరించిన మునికృష్ణ, బాలాజీపై పోక్సో, కిడ్నాప్ చట్టం కింద కేసు నమోదు చేసి పుత్తూరు కోర్టుకు తీసుకెళ్లారు. అక్కడ జడ్జి నిందితులకు 15 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట: పట్టణంలోని ఆకుతోట వీధి కాలవగట్టుపై సోమవారం విజిలెన్స్, సివిల్‌సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిల్వ ఉంచిన 42 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 1,890 కిలోల బియ్యం నిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. వీటి విలువ రూ.68,040 విలువ చేస్తాయని చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏఆర్ విజయకుమార్, ఎస్‌ఐ నాయక్, సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పునఃప్రారంభం



పుత్తూరు డీఎస్పీ కార్యాలయం

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితంగా పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం పునః ప్రారంభమైంది. పుత్తూరు డీఎస్పీగా వై.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టడంతో కార్యాలయం కొనసాగింపుపై అనుమానాలు తొలగిపోయాయి. గత ఏడాది ఏప్రిల్ 2న జరిగిన జిల్లాల పునర్విభజనలో పుత్తూరు మండలం తిరుపతి జిల్లాలో కలవడంతో పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్‌ను రేణిగుంట డివిజన్‌లోకి విలీనం చేశారు. అప్పటికే మంత్రి ఆర్కే రోజా పుత్తూరు సబ్ డివిజన్ నూతన భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించడంతో భవన నిర్మాణ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ ప్రాముఖ్యతను మంత్రి ఆర్కే రోజా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి, పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్‌ను కొనసాగించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోకి పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు, కేవీబీఆర్ పురం, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం పోలీస్ స్టేషన్లు వస్తాయని పేర్కొన్నారు. నగరిలో డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుతో పాటు పుత్తూరు డీఎస్పీ కార్యాలయాన్ని సైతం నిలుపుకోవడం పట్ల నగరి నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి ఆర్కే రోజా చిత్తశుద్ధిని చాటుతున్నారు.

శాంతి భద్రతలు పరిరక్షిస్తాం



పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షిస్తాం. నేను గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చాను. ఎక్కువ కాలం నెల్లూరు, తడ కేంద్రాల్లో పనిచేశాను. సబ్ డివిజన్ తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న కారణంగా అంతరాష్ట్ర నేరాలపైనా దృష్టి సారిస్తా. ప్రజల ఫిర్యాదులకు తొలి ప్రాధాన్యతనిస్తాం.

- వై. శ్రీనివాసరావు, డీఎస్పీ, పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్

అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య



డ్రైవర్ ప్రసాద్.(ఫైల్)

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లెలో నివాసం ఉన్న డ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ప్రసాద్(42) డ్రైవర్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషించేందుకు అప్పులు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై, గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు బిడ్డలు ఉన్నారు.

ఘర్షణలో వృద్ధునికి తీవ్ర గాయాలు



గాయ పడిన వెంకట్రామిరెడ్డి

రొంపిచెర్ల: రోడ్డు విషయమై ఘర్షణలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు, ఉసువారిపల్లెకు చెందిన వెంకట్రామిరెడ్డి(74) కుమారుడు సహదేవరెడ్డి పట్టా భూమిలో గతంలో రోడ్డు వేశారు. దీనిపై రెడ్డివారిపల్లె గ్రామస్తులు సహదేవరెడ్డితో పలు సార్లు ఘర్షణ పడ్డారు. సహదేవరెడ్డి పీలేరు కోర్టులో కేసు వేసి ఇంజెక్షన్ ఆర్డర్ తీసుకున్నారు. రోడ్డు వేస్తున్నారని తెలియడంతో సోమవారం కుమారుడు ఇంటి వద్ద లేకపోవడంతో తండ్రి వెంకట్రామిరెడ్డి అడ్డుకున్నారు. దీంతో రెడ్డివారిపల్లెకు చెందిన నరేష్, సుబ్బరామయ్య, గీతారాణి, హరి వెళ్లి వేట కొడవళ్లతో దాడి చేసి వెంకట్రామిరెడ్డిని గాయపరిచారు. దీంతో బాధితుడు 100కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి విద్యార్థికి గాయాలు



తీవ్రంగా గాయపడిన బాలాజీ

కురబలకోట(అన్నమయ్య జిల్లా) : మండల పరిధి అంగళ్లులోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రమాదవశాత్తు సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు పట్టణం రేపనపల్లెకు చెందిన బి.బాలాజీ (20) కురబలకోట మండలం అంగళ్లులోని పేరున్న కళాశాలలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌లో హాస్టల్‌కు వస్తుండగా బాటసారిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన మరో మోటార్ సైక్లిస్టు కిందపడిన బాలాజీని ఢీకొని వెళ్లిపోయాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సహచర విద్యార్థులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు ఆసుపత్రికి తరలించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సులోచన

చౌడేపల్లి : భర్త రెండో వివాహం చేసుకుని మోసం చేశాడన్న మనస్తాపంతో చౌడేపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.సులోచన(50) సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. చౌడేపల్లె పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు, బాధితురాలి కథనం మేరకు... చౌడేపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్.జి.పవన్‌కుమార్‌తో ఏడేళ్ల క్రితం తనకు వివాహం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన చెప్పింది. ఈ క్రమంలో రెండురోజుల క్రితం తన భర్త పవన్‌కుమార్ చౌడేపల్లె మండలం చారాల సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రవల్లికను రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపించింది. ప్రవల్లికతో చనువుగా ఉన్న విషయమై తమ దంపతుల మధ్య వివాదాలు ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లిందన్నారు. డాక్టర్ పవన్‌కుమార్‌తో తనకు ప్రేమ వివాహం జరిగిందని, తమ వివాహానికి సంబంధించి ఆధారాలు లేకుండా తన భర్త జాగ్రత్తపడ్డాడని సులోచన వివరించింది. అయితే ఈ విషయమై డాక్టర్ పవన్‌కుమార్‌ను వివరణ కోరితే తాను సులోచనను వివాహం చేసుకోలేదని, ఏడేళ్లుగా సహజీవనం చేస్తున్నట్లు చెప్పారు. సులోచనకు తనతో వివాహం జరిగినట్లుగా అందరికీ చెప్పుకుంటూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతోందని చెప్పారు. చౌడేపల్లె ఎస్‌ఐ రవికుమార్ మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం సీజ్: ఇద్దరి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అర్బన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ సీఐ జోగేంద్ర, ఇంటెలిజెన్స్ సీఐ వెంకటలక్ష్మి సిబ్బందితో కలిసి నగరంలోని మురకంబట్టు గేటు కూడలి వద్ద తనిఖీలు చేపట్టారు. 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగివున్న హేమకుమార్ (32)ను అరెస్టు చేశారు. ఇరువారం వద్ద 46 మద్యం ప్యాకెట్లు కలిగివున్న అరుణ్‌కుమార్ (29)ను పట్టుకున్నారు. మరో నిందితుడు కుమార్ పారిపోయాడు. ఇద్దరినీ అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో 14 మంది ఎర్రచందనం కూలీలు

గుడిపాల: 14 మంది ఎర్రచందనం కూలీలను గుడిపాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు నుంచి శేషాచలం అడవుల్లో ఎర్రచందనాన్ని కొట్టేందుకు కూలీలు వస్తున్నారని గుడిపాల ఎస్‌ఐ రాజశేఖర్‌కు సోమవారం సాయంత్రం సమాచారం అందింది. వెంటనే చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని గుడిపాల పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు కాపుగాచి రెండు కార్లను అదుపులోకి తీసుకున్నారు. అందులో 14మంది కూలీలు ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారిలో చిత్తూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు, తమిళనాడు రాష్ట్రం వేలూరు పరిసర ప్రాంతాలకు చెందిన 11మంది వ్యక్తులు ఉన్నారు. చిత్తూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి కారులో వెళ్లి వేలూరులో నుంచి 11 మందిని తీసుకొని వస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులు విచారించగా తాము ఎర్రచందనం కొట్టేందుకు వెళ్తున్నామని చెప్పారని తెలిసింది. ఇంకా పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించలేదు.

నమో..నారసింహా!



పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో భక్తుల సందడి

రాపూరు: పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అత్తారిల్లు గోనుపల్లి నుంచి స్వామివారు ఉభయదేవేరులు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మితో కలిసి పెంచలకోనకు చేరుకున్నారు. కొత్త అల్లుడు పెంచలకోనకు చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి.

నరసింహుడు పెళ్లికొడుకాయనే!

హిరణ్యకసిపుని వధించిన ఉగ్రరూపుడైన స్వామివారు నరసింహ అవతారంలో వెలుగొండలలో సంచరిస్తుండగా చెంచురాజు(గిరిజనరాజు) కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించి ఆమెను వివాహమాడినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ మేరకు గోనుపల్లి గ్రామంలోని స్వామివారు పెళ్లికొడుకై ఉదయం గోనుపల్లి గిరిజన కాలనీకి రావడంతో ఆ కాలనీలో పెళ్లి సందడి నెలకొంది. ఉత్సవమూర్తులను దేవదాయ సిబ్బంది గిరిజన కాలనీకి తీసుకొచ్చారు. గిరిజనులు సంప్రదాయబద్ధంగా ఇంటి అల్లుడికి, కుమార్తెకి ఆతిథ్యం ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆహారం, ఇతర లాంఛనాలు అందించేందుకు తెల్లవారుజామునే అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు, పెద మల్లెపూలు, బందారు ఆకులతో భాషికం, ఎల్లగడ్డలు, తంగేడుతో తాళిబొట్టు, స్వామివారికి కట్నంగా ఇచ్చే ఆరినార మొలతాడును అందజేసి సాంగ్యం చెల్లించారు. స్వామివారికి టెంకాయ, కర్పూరం, వడపప్పు, చీర, రవికలు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి గుమ్మం వద్ద తోరణాలతో ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లు పెంచలకోనకు గోనుపల్లి నుంచి బయలుదేరగానే వర్షం ప్రారంభమైంది.

గొల్లబోయికి తొలిదర్శనం

శ్రీవారు అప్పట్లో తమ మహిమలను గురించి గ్రామస్తులకు వివరించి ఆలయం నిర్మించమని చెప్పినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. అలాగే గొల్లబోయిని వెనుతిరిగి చూడకుండా వెళ్లమని ఆదేశించాచగా.. గొల్లబోయిన వెనుతిరిగి చూడడంతో శ్రీవారే గొల్లబోయి శిలారూపం దాల్చారని ప్రతీతి. దీంతో ఏటా శ్రీవారు సతీసమేతంగా గొల్లబోయికి తొలి దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తోంది.